క్లుప్తంగా

స్పోర్ట్స్ దుస్తుల పంపిణీ



స్పోర్ట్స్ డ్రెస్‌లు పంపిణీ చేస్తున్న దాత

నారాయణఖేడ్: ఖేడ్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆదివారం ఉచితంగా క్రీడాదుస్తులు పంపిణీ చేశారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడలకు సంబంధించిన క్రీడాకారులైన 80 మంది విద్యార్థులకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ జలమండలి మేనేజర్ సంతోష్ కుమార్ తనతల్లి కళావతి జ్ఞాపకార్థం స్పోర్ట్స్ డ్రెస్సులను అందజేశారు. తన తల్లి కళావతి ఇదే పాఠశాలలో చదివి, ఉపాధ్యాయురాలిగా ఇదే పాఠశాలలో పనిచేసినందున.. విద్యార్థులకు తనవంతు సహకారం అందించడం అదృష్టంగా భావిస్తున్నానని సంతోష్ కుమార్ అన్నారు. ప్రధానోపాధ్యాయులు మన్మథ కిషోర్, స్థానిక లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వెంకట్ రావు, సభ్యులు చంద్రశేఖర్, జైపాల్‌రెడ్డి, రాజయ్య, రాజశేఖర్, సంగ్రాం, గురునాథ్ పాల్గొన్నారు.

హెచ్‌ఎం రామకృష్ణకు అవార్డు



అవార్డును అందుకుంటున్న రామకృష్ణ

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): మండలంలోని నిజాంపూర్(కే) ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు పోట్రు రామకృష్ణ రాష్ట్ర స్థాయి బెస్ట్ టీచర్ ఇన్స్పిరేషన్ అవార్డును అందుకున్నారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లోని బీఎం బిర్లా సైన్స్ సెంటర్‌లోని భాస్కరా ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో శాతవాహన యూనివర్సిటీ వైస్ చైర్మన్ ఉమేష్ కుమార్, రోబోటిక్ సీఈఓ మనీష్ జిందాల్ అవార్డును ప్రదానం చేశారు. పాఠశాల నిర్వహణ, వినూత్న విద్యా బోధన, సామాజిక సేవలకు గాను పురస్కారాన్ని అందజేసినట్లు శారద ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ పట్నం కమల మనోహర్ తెలిపారు. కార్యక్రమంలో శాతవాహన యూనివర్సిటీ వైస్ చైర్మన్ ఉమేష్ కుమార్, వ్యాపారవేత్త మునిష్ జిందాల్, డాక్టర్ సాహిత్యవల్లి, నక్క శ్రీనివాస్, పట్నం సుజాత, తోట ప్రవీణ నాయుడు, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వసంతరావుకు నివాళి



నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేత నీలం మధు

పటాన్‌చెరు: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన నాందేడ్ ఎంపీ వసంత్‌రావు చావన్ చిత్రపటానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూలమాలవేసి నివాళులర్పించారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం రేవంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కర్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ స్థానిక నాయకులతో కలిసి వసంతరావు చావన్ నివాసంలో వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వసంతరావు చవాన్ వారసుడు రవీంద్ర చవాన్, నాయగావ్ అసెంబ్లీ అభ్యర్థి మీనల్ పాటిల్ కొనసాగించాలని సీఎం సూచించారు.

మృత్యుంజయ హోమం



హోమం నిర్వహిస్తున్న పీఠాధిపతులు

ఝరాసంగం(జహీరాబాద్): జిల్లాలో ఆధ్యాత్మిక క్షేత్రమైన బర్దీపూర్ శ్రీ దత్తగిరి మహరాజ్ ఆశ్రమంలో మృత్యుంజయ హోమం, దత్తయజ్ఞం, హోమం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం ఆశ్రమ పీఠాధిపతులు 108 వైరాగ్య శిఖామణి అవధూతగిరి మహరాజ్, సిద్ధేశ్వర స్వామి ఆధ్వర్యంలో కార్యక్రమాలు కొనసాగాయి. వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో మాతృశ్రీ అనసూయమాత, అర్చకులు, వైదిక పాఠశాల విద్యార్థులు, భక్తులు పాల్గొన్నారు.

గ్రూప్-3 పరీక్షలు ప్రశాంతం



నిమిషం ఆలస్యంతో పరీక్షకు దూరమైన అభ్యర్థి



పరీక్ష కేంద్రం వద్ద పాపను ఆడిస్తున్న ఎస్ఐ నాగలక్ష్మి



పరీక్ష కేంద్రం వద్దకు పరిగెడుతున్న యువతి



సమయం మించిపోతుందన్న భయంతో పరుగు..

జిల్లా వ్యాప్తంగా ఆదివారం జరిగిన గ్రూపు-3 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. విద్యార్థులు రెండు గంటల ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. 9.30 నిమిషాలకు అభ్యర్థులను పరీక్ష సెంటర్‌లోకి అనుమతించారు. అక్సాన్ పల్లికి చెందిన నాగరాజు ఒక్క నిమిషం ఆలస్యం కావడంతో లోపలికి అనుమతించలేదు. దీంతో మనస్థాపానికి గురై హాల్ టికెట్‌ను పరీక్ష కేంద్రం ముందే చింపేసి వెనుదిరిగాడు. మరో అభ్యర్థిని కూడా ఆలస్యంగా రావడంతో చేసేది లేక వెనుదిరిగింది. అమీన్‌పూర్ పరీక్ష కేంద్రం వద్ద తల్లి పరీక్షకు వెళ్లడంతో పాపను బొల్లారం ఎస్ఐ నాగలక్ష్మి ఆడించారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఎక్కడి చెత్త అక్కడే..

- ఎటుచూసినా చెత్తకుప్పలే
- పందులు, కుక్కలు స్వైరవిహారం
- రోగాల బారిన ప్రజలు



గొల్లగూడెంలో గుంపులుగా కుక్కలు, పందులు

సంగారెడ్డి టౌన్ : జిల్లా కేంద్రం సంగారెడ్డిలో వీధులన్నీ చెత్తతో నిండి అస్తవ్యస్తంగా మారాయి. చెత్తను తొలగించేందుకు అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఎక్కడ చూసినా చెత్తకుప్పలే దర్శనమిస్తున్నాయి. చెత్త పేరుకొని పోవడంతో పందులు, కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో దుర్గంధం వెదజల్లడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని ఉన్నతాధికారులు, అధికారులు పట్టించుకోవడం లేదని పట్టణవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాలనీల్లో ఏర్పాటు చేసిన పార్కులు కూడా చెత్తతో నిండిపోవడంతో పిల్లల ఆడుకోవడానికి కూడా వీలులేకుండా పోయిందని వాపోతున్నారు. మున్సిపల్ యంత్రాంగం తూతూమంత్రంగా పనిచేస్తోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రోడ్లపై చెత్త వేయడంతో దోమలు విజృంభించి ఆయా కాలనీల్లోని ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోనే పారిశుధ్యం అధ్వానంగా ఉంటే గ్రామాల్లో పరిస్థితి ఏవిధంగా ఉంటుందోనని ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని వెంటనే చెత్తను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

ఉపాధ్యాయులపై వేధింపులు ఆపాలి

- ఎస్‌జీటీయూ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్



హత్నూర (సంగారెడ్డి): కుటుంబ ఆర్థిక కులగణన సర్వే చేస్తున్న ఉపాధ్యాయులపై అధికారుల వేధింపులు ఆపాలని ఎస్‌జీటీయూ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆకుల ప్రభాకర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సర్వేలో ఉపాధ్యాయులు ఒకవైపు పాఠశాల, మరొక పక్క సర్వేను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. కొందరు అధికారులు పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీఓలు పెత్తనం చేయడం ఏంటని ప్రశ్నించారు. ఉపాధ్యాయలతో సమన్వయంతో పనిచేయించుకోవాలి, ఒకవైపు ప్రభుత్వం టార్గెట్ పెట్టి నిర్ణీత గడువులో పూర్తి చేయాలంటే న్యాల్‌కల్ మండల చాల్కిలో సర్వే చేస్తున్న శంకర్ అనే ఉపాధ్యాయుడు ఫారం కావాలని ఎంపీఓ సురేష్‌ను అడిగితే దురుసుగా మాట్లాడటం జరిగిందన్నారు. ఇలాంటి అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సందడిగా వనభోజనాలు



పటాన్‌చెరు టౌన్: మాట్లాడుతున్న కుమార్



అతిథులను సన్మానిస్తున్న నిర్వాహకులు

పటాన్‌చెరు టౌన్: సన్నిహితుల కలయికకు కేరాఫ్ కార్తీకమాస వనభోజనాలు అని కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ అన్నారు. ఆదివారం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ గ్రామానికి చెందిన జైగోకుల కృష్ణ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో పోచారం గ్రామ సమీపంలో గల మల్లన్న దేవస్థానం వద్ద కార్తీక మాసం వనభోజనాలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్, రామచంద్రపురం డివిజన్ కార్పొరేటర్ పుష్ప యాదవ్‌ను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఆదివారం బీసీ వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తీకమాసం వనభోజనాలు నిర్వహించారు. కార్యక్రమంలో బీసీ వెలమ సంఘం నాయకులు పాపారావు, అప్పారావు, రామానాయుడు, టీవీ నటుడు దత్తి రాజేష్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు సంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

వేతన బకాయిలు చెల్లించాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు



సమావేశంలో మాట్లాడుతున్న సాయిలు

హత్నూర (సంగారెడ్డి): గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామాలను అద్దంలా శుభ్రం చేస్తున్న కార్మికులకు నెలనెలా వేతనాలు ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు. వీధిలైట్లు, పారిశుధ్య కార్మికులు, వాటర్, పల్లె ప్రకృతి, రోడ్డు శుభ్రం చేయడం అనేక రకాల పనులు చేస్తున్నా నెలకు 9500 చెల్లిస్తున్నారని విమర్శించారు. రెగ్యులర్‌గా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ధరలకు అనుగుణంగా కనీస వేతనం 26,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు శంకర్, అశోక్ , చంద్రయ్య, వెంకటయ్య, రాజు, మల్లేశం, లక్ష్మి, సువర్ణ, నరేష్, నాగయ్య పాల్గొన్నారు.

ప్రజా పోరాటాలను బలపర్చండి

- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాజయ్య



సమావేశంలో మాట్లాడుతున్న రాజయ్య

పటాన్‌చెరు టౌన్: జనవరి 25 నుంచి 28 వరకు జిల్లా సంగారెడ్డి పట్టణంలో నిర్వహించే సీపీఎం పార్టీ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాజయ్య పిలుపునిచ్చారు. ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నయా ఉదారవాద ఆర్థిక విధానాలతో పారిశ్రామిక రంగం దీవాలా తీసిందన్నారు. విద్య, వైద్యం సామాన్యులకు అందని ద్రాక్షలా మారిందని వాపోయారు. ప్రజలు చమటోడ్చి నిర్మించిన ప్రభుత్వ రంగ సంస్థలను అంబానీ, ఆదాని లాంటి బడా కార్పొరేట్ సంస్థలకు కారుచౌకగా అమ్మేస్తుందన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను, చట్టాలను లేబర్ కోడ్స్ పేరుతో కేంద్ర ప్రభుత్వం కాలరాస్తుందని దుయ్యబట్టారు. రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు, కార్మికులు, రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు అనేక ఆశలుపెట్టుకున్నారు. కార్యక్రమంలో సంతోష్ కుమార్ గౌడ్, రాజశేఖర్, సుజీత్, కిరణ్, రాజు, మెగరాజు, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

పథకాలతో ప్రయోజనం



చెక్కు అందజేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

నారాయణఖేడ్: ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. కల్హేర్ మండలం మార్డి గ్రామానికి చెందిన నర్సింహులుకు సీఎంఆర్ఎఫ్ నుంచి ఆర్థిక సహాయం మంజూరయిందన్నారు. సంబంధిత చెక్కును ఆదివారం అందజేశారు. కాంగ్రెస్ నాయకులు రవీందర్‌రెడ్డి, తుకారాం, సాయి లు, ఈశ్వరప్ప, అశోక్ పాల్గొన్నారు. అలాగే, నాగల్‌గిద్ద మండల కాంగ్రెస్ ఎస్సీసెల్ అధ్యక్షుడు స్వామిదాస్ శనివారం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. సంగారెడ్డిలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి పరామర్శించారు.

ఇంటికి చేరిన విద్యార్థులు

జిన్నారం (పటాన్‌చెరు): ఆదర్శ పాఠశాలకు చెందిన ముగ్గురు పదో తరగతి విద్యార్థులు మనోజ్‌కుమార్, అఖిల్, మల్లికార్జున్ పాఠశాల నుంచి పారిపోయిన సంఘటన పాఠకులకు విధితమే. ఈ మేరకు బొల్లారం పోలీసులు ముగ్గురు విద్యార్థులు చార్మినార్ వద్ద ఉన్నారని తెలుసుకొని తల్లిదండ్రులకు అప్పగించారు. విద్యార్థులను తల్లిదండ్రులు జాగ్రత్తగా తీసుకోవాలని పోలీసులు సూచించారు. విద్యార్థులు క్షేమంగా ఇంటికి రావడంతో తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

రెండు తలల దూడ జననం



రెండు తలల దూడ

నారాయణఖేడ్: మండలంలోని అనంతసాగర్‌కు చెందిన రైతు సాయిరెడ్డికి సంబంధించిన గేదె ఆదివారం రెండు తలలతో కూడిన దూడకు జన్మించింది. వెనుకభాగం ఒకేదూడగా అతుక్కుని రెండు తలలతో ఉంది. దూడ మృతి చెందినట్లు రైతు తెలిపారు. దూడను గ్రామస్తులు ఆసక్తిగా తిలకించారు.

ఘనంగా గ్యార్మీ ఉత్సవాలు

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని బీసీ కాలనీ హజ్రత్ గౌస్ ఆజాం దస్తగిరి దర్గాలో ఆదివారం గ్యార్మీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు కౌన్సిలర్ చంద్రారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ముస్లిం మతపెద్దలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రాజు, నాయకులు సంపత్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి గౌస్ ఫాసీల్, ఖాదీర్, అఫ్రోజ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహాపడి పూజ



సంగారెడ్డిలో మహాపడిపూజ

సంగారెడ్డి టౌన్ : పట్టణంలో అయ్యప్పస్వామి మహా పడిపూజను ఆదివారం ఘనంగా నిర్వహించారు. శబరిమలలో జరిగేలా తాంత్రిక రీతిలో స్వామివారి పూజా కార్యక్రమాన్ని జరిపించారు. పోతిరెడ్డిపల్లి చౌరస్తా నుంచి సన్‌రైస్ హస్పిటల్ వరకు అయ్యప్పస్వాములు విగ్రహ ఊరేగింపు చేశారు. జంగిరెడ్డి భజన బృందం పాడిన పాటలు ఆకట్టుకున్నాయి. మహాపడి వెలిగించారు. జిల్లా నలుమూల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

బీఎంఎస్‌తోనే సమస్యల పరిష్కారం

- రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రదీప్‌కుమార్



మాట్లాడుతున్న ప్రదీప్‌కుమార్

పటాన్‌చెరు: బీఎంఎస్‌తోనే కార్మికుల సమస్యల పరిష్కారం సాధ్యమని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రదీప్‌కుమార్ అన్నారు. ఆదివారం పటాన్‌చెరు మండలం పాశమైలారం పారిశ్రామికవాడలోని హిమజాల్ బేవరేజ్ పరిశ్రమ కార్మికులు సీఐటీయూ యూనియన్ నుంచి బీఎంఎస్ యూనియన్‌లో చేరారు. ఈ సందర్భంగా ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ.. పరిశ్రమలో కార్మికుల వేతన ఒప్పందం 18 నెలలైనా పూర్తి కాలేదన్నారు. కార్మికులు ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారని, ప్రశ్నిస్తే బెదిరింపులు, దౌర్జన్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఐటీయూ యూనియన్ నాయకులకు కార్మికుల సమస్యలు పట్టవని కేవలం సభలు, సమావేశాల, సోషల్ మీడియాతోనే కాలం గడుపుతారని విమర్శించారు. హిమజాల్ బేవరేజ్ పరిశ్రమ కార్మికుల సమస్యలన్నీ పరిష్కరించి, ఘనమైన వేతన ఒప్పందం చేస్తామని కార్మికులకు హామీ ఇచ్చారు. యాజమాన్యం కార్మికులను వేధించడం, తొలగించడం చేస్తే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి మహేష్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, సంజయ్‌కుమార్, మురారి, నర్సింలు, శ్రావణ్‌కుమార్, రవి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సదర్ సమ్మేళనం



దున్నపోతులతో యాదవులు, నాయకులు

సదాశివపేట(సంగారెడ్డి): సదాశివపేట పట్టణం శ్రీ కృష్ణనగర్ కాలనీలో శనివారం రాత్రి లడ్డుయాదవ్ ఆధ్వర్యంలో సదర్ సమ్మేళనం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సదర్ సమ్మేళనం తిలకించేందుకు మండల పరిధిలోని యాదవ సోదరులు, ప్రజలు భారీగా తరలివచ్చారు. యువకులు తీన్మార్ స్టెప్పులు నడుమ అందరంగా అలంకరించిన దున్నరాజులను కాలనీలోని ప్రధాన రహదారుల గుండా ఊరేగింపు నిర్వహించారు. యాదవసోదరులు పోతులతో చేయించిన నృత్యాలు అందరినీ ఆకర్షించాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రమేష్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు సాయినాథ్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి, విజయ్‌కుమార్, యాదవ సోదరులు పాల్గొన్నారు.

కిక్కిరిసిన జహీరాబాద్ బస్టాండ్



బస్సుల కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ బస్టాండ్‌లో ఆదివారం బస్సుల రాక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జహీరాబాద్ నుంచి హైదరాబాద్, నారాయణఖేడ్, సంగారెడ్డి, కర్నాటక, మహారాష్ట్రాలకు వెళ్లేందుకు బస్సు సౌకర్యం ఉంది. అధిక శాతం మంది హైదరాబాద్, సంగారెడ్డి, కర్నాటకలోని బీదర్, గుల్బర్గా ప్రాంతాలకు వెళ్తుంటారు. ప్రభుత్వం ఉచిత బస్సు సౌకర్యం కల్పించినప్పటి నుంచి రద్దీ పెరిగింది. ప్రయాణికులకు అనుగుణంగా బస్సులు లేకపోవడం.. ఉన్న బస్సులను చాలా వరకు తగ్గించారు. చాలీచాలని బస్సులతో ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. ఆదివారం కావడంతో ఊర్లకు వచ్చిన విద్యార్థులు, ఉద్యోగులు హైదరాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు బస్టాండ్‌కు వచ్చారు. దీంతో బస్టాండ్ ప్రయాణికులతో కిక్కిరిసింది. హైదరాబాద్ బస్సు వచ్చిందంటే సీటు కోసం పరుగులు తీయడం కనిపించింది. బస్సుల కోసం ప్రయాణికులు బస్టాండ్‌లో గంటల తరబడి ఎదురుచూశారు. జహీరాబాద్–హైదరాబాద్ బస్సు సర్వీసులు పెంచాలని ప్రయాణికులు కోరుతున్నారు.

నూతన వసతి గృహం ప్రారంభం



వసతిగృహాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

ఝరాసంగం(జహీరాబాద్): మండల కేంద్రం ఝరాసంగంలోని ఎస్సీ బాలికల సంక్షేమ వసతి గృహాన్ని పాఠశాల అదనపు తరగతి గదుల్లోకి మార్చారు. పాత భవనం శిథిలావస్థకు చేరి ఇబ్బందికరంగా మారింది. దీంతో పాఠశాల అదనపు గదుల భవనాన్ని కేటాయించారు. ఆదివారం అధికారులు, నాయకులు పూజలు నిర్వహించి, వసతి గృహాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమ శాఖ డివిజన్ అధికారి శ్రీనివాస్, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మండల అధ్యక్షుడు హన్మంత్ రావు పాటిల్, వెంకటేశం, సర్పంచుల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు రుద్రప్పపాటిల్, జగదీశ్వర్, వార్డెన్‌లు చంద్రమ్మ, వెంకటేశం, నాయకులు చంద్రన్న, రబ్బాని పాల్గొన్నారు.

సిమెంట్ కుర్చీల ఏర్పాటు



కుర్చీలు ఏర్పాటు చేస్తున్న మారుతియాదవ్

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని మల్గి గ్రామంలోని ప్రధాన ఆలయాలు, దర్గాల వద్ద మాజీ సర్పంచ్ మారుతి యాదవ్ సిమెంట్ కుర్చీలను ఏర్పాటు చేశారు. తన తల్లి మహాదేవి వర్ధంతిని పురస్కరించుకొని ఆమె జ్ఞాపకార్థం బొంగొండ్వేర, పాండురంగ, బేతాళ స్వామి, సాయిబాబ, నవనాథ్ సిద్ధేశ్వర ఆయాలతో పాటు మైబు సుభానీ దర్గా వద్ద కుర్చీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వినోద్, దత్తు, మారుతి, నగేష్, సునీల్, మహేష్, సాయి నాథ్ తదితరులు పాల్గొన్నారు.

నాందేడ్‌లో ఎంఐఎం ప్రచారం

నారాయణఖేడ్: మహారాష్ట్రలోని నాందేడ్ దక్షిణ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎంఐఎం అభ్యర్థిగా పోటీ చేస్తున్న సయ్యద్ మొయిన్ తరఫున ఖేడ్ పట్టణ ఎంఐఎం అధ్యక్షుడు మొహిద్ పటేల్ ఆదివారం ప్రచారం చేశారు. అక్కడి కార్యకర్తలు, నాయకులతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ.. ప్రచార కరపత్రాలను పంచుతూ తమ పార్టీ కులమతాలకు అతీతంగా పనిచేస్తుందని, ఎంఐఎంతోనే అభివృద్ధి సాధ్యమని వివరించారు. గాలిపటం గుర్తుకు ఓట్లు వేసి ఎంఐఎం అభ్యర్థిని గెలిపించాలని కోరారు.



కరపత్రాలు అందజేస్తున్న మొహిద్‌పటేల్

ఓఆర్‌ఆర్‌పై రెండు కార్లు ఢీ

ముగ్గురి చిన్నారులకు గాయాలు



బాలిక జ్యోత్స్నను ఆస్పత్రిలోకి తీసుకెళ్తున్న 108 సిబ్బంది

పటాన్‌చెరు టౌన్: కర్దనూరు సమీపంలో ఓఆర్ఆర్‌పై ముందు వెళ్తున్న కారును వెనుకనుంచి వచ్చిన మరో కారు ఢీకొట్టిన ఘటనలో ఒకరికి తీవ్రగాయాలు కాగా, మిగతా వారికి స్వల్పగాయాలయ్యాయి. ఈ సంఘటన భానూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. పోలీసు కథనం ప్రకారం.. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కర్దనూరు సమీపం ఓఆర్ఆర్‌పై ఐదుగురు వ్యక్తులతో వెళ్తున్న కారును వెనుకవైపు నుంచి వేగంగా వచ్చిన మరో కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో ముందు కారు లో ప్రయాణిస్తున్న జ్యోత్స్న అనే బాలికకు తీవ్ర గాయాలు కాగా వర్షిత, వర్షిణితో పాటు మరోకరికి స్వల్పగాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

జాతీయ పోటీలకు ఎంపిక



విద్యార్థిని రుషివందనను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, కరస్పాండెంట్

నారాయణఖేడ్: జిమ్నాస్టిక్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఖేడ్ ఈ-తక్షిల పాఠశాలకు చెందిన విద్యార్థిని మూడ్ రుషివందన అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ శరత్ కుమార్ తెలిపారు. ఈనెల 30 నుంచి వచ్చేనెల 4వ తేదీ వరకు జాతీయ స్థాయి పోటీలు జరగనున్నాయన్నారు. రుషివందనను ఉపాధ్యాయులు, విద్యార్థినులు అభినందించారు.